

స్వేచ్ఛగా ఓటెయ్యండి

ప్రతీ ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి సూచించారు. 10లో▸



ఆగిన రిజిస్ట్రేషన్లు

కొందుర్గు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారం రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. 10లో▸



గొర్రెలమందపై కుక్కల దాడి

కడ్తాల్ మండలం ముద్వీన్ గ్రామంలో వీధికుక్కల దాడిలో పది గొర్రెపిల్లలు మృతి చెందాయి. 10లో▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ రాజీనామా

చేవెళ్ల: పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి అండగా ఉన్న తమకు తగిన గుర్తింపు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నూర్జహాన్ బేగం, ఆమె కుమారుడు మైనార్టీ నాయకుడు తాఫిక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆమె గురువారం కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ.. పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించటంలేదని.. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులకు పెద్దపీట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకోసం ఇన్నాళ్లు పనిచేసిన తమకు మాత్రం అవమానాలు, ప్రాధాన్యత లేకుండా చేయటం లాంటివి జరుగుతున్నాయని వాపోయారు. వీటిని భరించలేక పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నాతోపాటు నాకుమారుడు సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశాడని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి: ఎమ్మెల్యే సబిత



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు ఆ పార్టీలో ఇమడలేక మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఘట్టుపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు కృష్ణ నాయక్ గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గానికి రూ.కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఘట్టుపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ సాదత్, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంకరయ్య, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్, రవినాయక్, దేవులా నాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

6న ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళనం

పంజగుట్ట: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఈ నెల 6న యాప్రాల్‌లోని, బాపూజీ నగర్ ఎక్స్ రోడ్డు వద్ద 'ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కుతాడి కుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎరుకలకు ప్రత్యేకంగా ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 లక్షల మంది ఎరుకలు, దేశంలో ఉన్న మూడు కోట్ల మంది కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించాలని, కార్పొరేషన్ చైర్మన్ పదవి తమ జాతివారికే ఇవ్వాలని కోరారు.ఉపాధ్యక్షుడు సిల్‌యార్తి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కోశాధికారి రఘు, మహిళా అధ్యక్షురాలు శ్యామల, లింగయ్య, శ్రీహరి, కార్తిక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేతలు సమర్థ్, శ్రేష్ట

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్–15 బాలబాలికల విభాగాల్లో పులిపాక శ్రీ సమర్థ్, గుకంటి శ్రేష్ట శ్రీ విజేతలుగా నిలిచారు. సమర్థ్ నాలుగు పాయింట్లు, శ్రేష్ట మూడు పాయింట్లు సాధించారు. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని ఐదు రౌండ్లపాటు నిర్వహించారు. విజేతలకు టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, సుజాత హైస్కూల్ డైరెక్టర్ జేపీ సింగ్, కొడాలి హరిత ట్రోఫీలు అందజేశారు. ఆయా వయో విభాగాల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.

బాలుర విభాగం: అండర్–13: 1. సుహిత్ రావికంటి, 2. ప్రణవ్. అండర్–11: 1. మైలవరపు ధార్మిక విరాట్, 2. కృతిక్‌దేవ్. అండర్–9: 1. అభినవ్, 2. ఆత్రేయ జయరాజ్ రామ్‌కుమార్. అండర్–7: 1. ప్రక్రిత్ ఠాకూర్, 2. శ్రీరామ స్కంద. బాలికల విభాగం: అండర్–11: 1. హైమ సాన్విత, 2. రంగిశెట్టి నమస్వి లక్ష్మి. అండర్– 9: 1. దియా పార్థసారథి, 2. త్రిషిక పట్నాయక్. అండర్–7: 1. సయ్యద్ రౌద్, 2. విశిత.

పాతాళానికి గంగమ్మ



- శేరిలింగంపల్లి, హయత్‌నగర్‌లో ఆందోళనకరం
- బోర్లు వట్టిపోయి, నల్లా నీళ్లురాక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- శివారు మున్సిపాలిటీల్లో ట్యాంకర్లే ఆధారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. ఈ యేడాది జనవరితో పోలిస్తే ఏప్రిల్ చివరి నాటికి నీటిమట్టం పాతాళానికి పడిపోయింది. శేరిలింగంపల్లిలో 42.12 మీటర్ల లోతుకు పడిపోగా, ఇబ్రహీంపట్నంలో 24.12 మీటర్లు, హయత్‌నగర్‌లో 21.15 మీటర్లు, తలకొండపల్లిలో 19.01 మీటర్లు, చౌదరిగూడెంలో 17.94 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మెజార్టీ ఫీజో మీటర్లలో నీటి నిల్వల ఆనవాళ్లు 10 నుంచి 15 మీటర్ల లోతుకు పడిపోయాయి. సరిపడా వర్షాలు కురియక పోవడం, చెరువులు, కుంటలు ఇప్పటికే ఒట్టిపోవడం, అవసరానికి మించి నీటిని బయటికి తోడేస్తుండటంతో భూగర్భజలమట్టం అడుగంటడానికి ప్రధాన కారణం. ముఖ్యంగా బహుళ అంతస్థుల నిర్మాణాలు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు అధికంగా కొనసాగే శేరిలింగంపల్లి, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో భూగర్భ నీటి నిల్వలు ఆందోళన కలిగిస్తున్నాయి. మంచాల, మాడ్గుల, కడ్తాల్, ఆమనగల్లు తదితర మండలాల్లో ఇప్పటికే వ్యవసాయ బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. ఆకుకూరలు, కాయకూరల పంటలు, మామిడి తదితర పండ్ల తోటలకు సరిపడా నీరులేక ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

సాధారణం కంటే తక్కువ వర్షపాతం..

జిల్లాలో సాధారణ వర్షపాతం 660.5 మి.మీ కాగా ఈ సీజన్‌లో 656 మి.మీ మాత్రమే కురిసింది. ఐదు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, మూడు మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. 19 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భూగర్భ జలవనరుల శాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫీజో మీటర్లలో జనవరిలో 9.84 మీటర్ల లోతులో లభించిన నీటి ఆనవాళ్లు.. ఫిబ్రవరి నాటికి 12 మీటర్ల లోతుకు, ఏప్రిల్ చివరి నాటికి 14.8 మీటర్ల లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు గతంలో 250 అడుగుల లోతులో కనిపించిన భూగర్భ జలాలు ప్రస్తుతం 500 అడుగుల లోతుకు మించి బోర్లు వేసినా కనిపించడం లేదు. సాగునీటికే కాదు తాగు నీటికీ ఇబ్బందులు తప్పేలా లేవు.

సరిపోని భగీరథ నీరు..

మిషన్ భగీరథ ద్వారా కృష్ణా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా.. ఆశించిన స్థాయిలో సరఫరా కావడం లేదు. మెజార్టీ పల్లెల్లో నాలుగైదు బిందెలకు మించి రావడం లేదు. శివారు మున్సిపాలిటీల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. దీనికి తోడు భూగర్భజలాలు కూడా పడిపోవడంతో ఇళ్లల్లోని బోర్లుకూడా ఎండిపోవడం కూడా ఆందోళనల కలిగిస్తోంది. నగరానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీల పరిధిలోని అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారు ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుంది. వినియోగదారుల బలహీనతను ఆసరాగా తీసుకుని ట్యాంకర్ల యజమానులు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

జిల్లాలో భూగర్భ నీటిమట్టం (మీటర్ల లోతు) ఇలా..

మండలం	జనవరి	ఏప్రిల్
శేరిలింగంపల్లి	30.03 మీ	42.12 మీ
ఇబ్రహీంపట్నం	14.55 మీ	24.12 మీ
హయత్‌నగర్	13.77 మీ	21.15 మీ
తలకొండపల్లి	16.86 మీ	19.01 మీ
చౌదరిగూడెం	8.98 మీ	17.94 మీ
కడ్తాల్	11.44 మీ	16.45 మీ
షాబాద్	10.05 మీ	15.39 మీ
శంకర్‌పల్లి	10.38 మీ	14.95 మీ
మహేశ్వరం	10.03 మీ	14.03 మీ
మంచాల	10.57 మీ	14.34 మీ
కొత్తూరు	10.31 మీ	14.02 మీ
చేవెళ్ల	10.86 మీ	13.36 మీ
నందిగామ	10.78 మీ	12.33 మీ
రాజేంద్రనగర్	10.80 మీ	12.43 మీ
సరూర్‌నగర్	9.63 మీ	12.14 మీ
శంషాబాద్	8.25 మీ	12.40 మీ
మొయినాబాద్	8.23 మీ	11.99 మీ
అబ్దుల్లాపూర్‌మెట్	7.02 మీ	11.19 మీ
బాలాపూర్	8.43 మీ	11.17 మీ
ఫరూఖ్‌నగర్	9.44 మీ	10.89 మీ
గండిపేట్	10.35 మీ	10.75 మీ
కొందుర్గు	6.10 మీ	10.33 మీ
యాచారం	7.05 మీ	10.25 మీ
కందుకూరు	7.24 మీ	9.20 మీ
ఆమనగల్లు	8.16 మీ	9.15 మీ
మాడ్గుల	8.35 మీ	8.54 మీ
కేశంపేట	4.74 మీ	6.95 మీ

జిల్లాకు అదనపు ఈవీఎంలు

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్‌కు గురువారం సాయంత్రం 856 అడిషనల్ బ్యాలెట్ యూనిట్స్ వచ్చినట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, ఎన్నికల అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఖానాపూర్ సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో వాటిని భద్రపరిచినట్లు చెప్పారు.

షాద్‌నగర్‌కు 330..

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల కోసం షాద్‌నగర్ నియోజకవర్గానికి గురువారం అదనంగా 330 ఈవీఎంలు వచ్చినట్లు షాద్‌నగర్ ఆర్డీఓ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు తెలిపారు. వీటిని పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చినట్లు తెలిపారు. పోలీసు బందోస్తు ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత



అనితారెడ్డి, కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: దేశంలో మెజార్టీ ఎంపీ స్థానాలను ఇండియా కూటమి కైవసం చేసుకుంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండల పరిధిలోని సుభాన్‌పూర్‌కి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు గురువారం అనితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె మాట్లాడుతూ... దేశంలో పదేళ్ల బీజేపీ పాలన పట్ల ప్రజలు విసుగుచెందారన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ ఓట్లను దండుకుంటోందన్నారు. బీజేపీ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్ల నుంచి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో మాజీ సర్పంచ్ సుగుణమ్మ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ బాలమ్మ, మాజీ ఉప సర్పంచ్ హన్మంత్, నాయకులు రంజిత్ కుమార్, సాయిరెడ్డి, జగన్, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, రాజు, కిషన్ సింగ్, మల్లేశ్, జగదీష్, రవి, రామచంద్రయ్య, కృష్ణగౌడ్, అయిలయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, సీనియర్ నాయకులు ఇజ్రాయెల్, రఘుపతి, కుమార్‌యాదవ్, హన్మంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణయ్య, రవూఫ్ పాల్గొన్నారు.

బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తాయి

- కేంద్ర మాజీ మంత్రి నారాయణలాల్ పంచారియా
- ముమ్మరంగా బీజేపీ నేతల ప్రచారం



మొయినాబాద్‌రూరల్: మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి నారాయణలాల్ పంచారియా

మొయినాబాద్ రూరల్: దేశంలో భారతీయ జనతా పార్టీకి 400కు పైగా సీట్లు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి నారాయణలాల్ పంచారియా జోస్యం చెప్పారు. గురువారం మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రిజర్వేషన్లపై అసత్యాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చూస్తున్నారని అయితే ప్రజలు వారి మాటలను నమ్మే స్థితిలో లేరన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజుగౌడ్, మండల ఉపాధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చండి

కందుకూరు: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరిచాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. మండల పరిధిలోని కొత్తగూడలో గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మరోసారి బీజేపీ కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి కొండాను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, మంఖాల్, తుక్కుగూడ, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి కొండా విశేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లోక్‌సభ ఎన్నికలు

- ఎలక్షన్ అబ్జర్వర్ తైవాంగ్ గ్యాచో భూటియా

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి తైవాంగ్ గ్యాచో భూటియా తెలిపారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను ఆయన పరిశీలించారు. అదే విధంగా పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని, పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల నిర్వాహణ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతి పోలింగ్ కేంద్రంలో టెంట్లు, మంచి నీటి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు ఖాతరు చేయనివారిపై చర్యలు తప్పవన్నారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేపట్టామని అన్నిరాఉ. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు, తహసీల్దార్ పార్థసారధి, ఏసీపీ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్ ఫెసిలిటీ సెంటర్లు
- 23వేల మంది ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక ప్రకటించారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేటి నుంచి ఈనెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి ఫామ్–12 ద్వారా ఓటువేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి సంబంధించి సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించి అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో, చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించి చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో, పరిగి నియోజకవర్గానికి సంబంధించి పరిగిలోని నం–1 బాలుర ఉన్నత పాఠశాలలో, వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి వికారాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, తాండూర్ నియోజకవర్గానికి సంబంధించి తాండూరు సాయిపూర్‌లోని నం–1 ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఓటర్ ఫెసిలిటీ సెంటర్స్(వీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో దాదాపు 23వేల మంది ఈ ఓటర్ ఫెసిలిటీ సెంటర్స్ ద్వారా ఓటు వేయనున్నారని ఆయన తెలిపారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో పోలింగ్ రోజున అత్యవసర విధుల్లో ఉండే 142 మంది అధికారులు ఫామ్–12డి ద్వారా ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు ఆయా ఓటర్ సెంటర్లలో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే గిరిజనుల సంక్షేమం



ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, గిరిజనులు

- తండాలను పంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్‌దే
- ఆమనగల్లు గిరిజన గర్జన సభలో ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనులకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాయని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన గిరిజన గర్జన సభలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు సేవాలాల్ గుట్ట వద్ద సేవాలాల్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్‌తో కలిసి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ గార్డెన్స్‌లో జరిగిన గిరిజన గర్జన సభలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గిరిజన తాండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందించారని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మొదలయ్యాయని విమర్శించారు. గ్రామాలు, తండాల్లో ప్రజలు మంచినీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో గిరిజనులంతా బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దోనాదుల కుమార్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రాధమ్మ, సయ్యద్ ఖలీల్, శ్రీను, ఎంగలి రఘు, సతీష్, సైదులుగౌడ్, శివ, అబ్బు, హనీఫ్, రంజిత్, భీమయ్య, జైపాల్‌నాయక్, శంకర్‌నాయక్, నాగులునాయక్, శ్రీనునాయక్, పంతునాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా గిరిజన గర్జన సభ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ నేతల్లో ఉత్సాహం కనిపించింది.



గిరిజన గర్జన సభలో మాట్లాడుతున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

ఓటు హక్కు వినియోగించుకోండి



పోలీసుల కవాతు

డీఐ రామిరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రామిరెడ్డి సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను దృష్ట్యా గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడ, బూర్గుల, మొగిలిగిద్ద, ఫరూఖ్‌నగర్ గ్రామాలలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్(కవాతు)ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ రామిరెడ్డి మాట్లాడుతూ.. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు, ఓటు హక్కు వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిర్వహణ సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించకుండా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా స్వేచ్ఛగా, శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భరోసాను కల్పిస్తామన్నారు. ఓటు హక్కు వినియోగానికి భంగం కలిగించినా, ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు కల్పించిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఐలు శరత్‌కుమార్, నయీమొద్దీన్, ఏఎస్ఐలు వెంకటేశ్, రాంచందర్, నర్సింహనాయక్, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉస్మాన్‌నగర్ బుర్హాన్‌ఖాన్ కుంట చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. ఒంటిపై నలుపు రంగు వస్త్రాలు ధరించి ఉన్నాయి. చేతికి నలుపు రంగు దారాలు న్నాయి. మృతురాలి వయసు దాదాపు 30–40 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదావశాత్తు చెరువులో పడిందా...? ఇతర కారణాలున్నాయా...? అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి మూడు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి సంబంధీకులెరవైనా ఉంటే బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



విఠల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నందిగామ: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ శివారు అంచుకుంట చెరువులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపాల కృష్ణ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన చిందం విఠల్(50) చేపలు పట్టేందుకు వెళ్లాడు. లోతైన ప్రదేశంలోకి వెళ్లడంతో ఊపిరాడక గుంతలోనే మునిగిపోయాడు. గమనించిన గొర్రెల కాపరులు కాపాడేందుకు యత్నించగా అప్పటికే మృతిచెందాడు. భార్య ఊర్మిల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

కార్మికులకు ప్లాస్టిక్ కవర్ల అందజేత



కార్మికులకు ప్లాస్టిక్ కవర్లను అందజేస్తున్న ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ పారిశుధ్య కార్మికుల సౌకర్యార్థం గురువారం ప్లాస్టిక్ కవర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల బస్తీలు, కాలనీలు, ప్రధాన రహదారులపై ప్రతిరోజు చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సేకరించిన చెత్తను వేరే సిబ్బంది ఆటోలు, లారీల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారన్నారు. ఇప్పుడు స్థానికులు వేసే చెత్తను పోగుచేసి ప్లాస్టిక్ కవర్‌లో వేసి తమకు వద్దకు వచ్చే ఆటో లేదా చెత్త వాహనదారుడికి అందిస్తారన్నారు. దీని ద్వారా ఓపెన్ పాయింట్ల సమస్య కూడా తీరనుందన్నారు.

అధికారి సస్పెండ్.. ఆగిన రిజిస్ట్రేషన్లు

- వారం రోజులుగా ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో వెలవెలబోతున్న కార్యాలయం

కొందుర్గు: కొందుర్గు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారం రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు నిర్వహించే డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యను ఉన్నాధికారులు ఏప్రిల్ 26న సస్పెండ్ చేశారు. నాటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో భూముల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్‌చేసుకున్న రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్‌లలో ఎవరైనా ఒకరు భూములు రిజిస్ట్రేషన్ చేసేందుకు లాగిన్ సదుపాయం ఉంటుంది. వీరిద్దరిలో ఎవరైనా సెలవులో ఉంటే మరొకరికి లాగిన్ చేసే అవకాశం ఉంటుంది. లాగిన్ మార్పిడి చేసే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. అయితే డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యను సస్పెండ్ చేసి వారం గడుస్తున్నా నేటికి లాగిన్ మార్పు కాకపోవడంతో కొందుర్గులో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి



గొర్రెల కళేబరాలు

పది జీవాలు మృత్యువాత

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో వీధి కుక్కల దాడిలో 10 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుడు కావేటి పెద్దయ్య తెలిపిన ప్రకారం.. రోజు మాదిరిగానే గురువారం రాత్రి గొర్రెలను మందలో ఉంచి ఇంటికెళ్లాడు. తిరిగి వచ్చే వరకు వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో పది గొర్రె పిల్లలు మృతి చెందాయని బాధితుడు వాపోయాడు. గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్న పెద్దయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని ముద్విన్ గ్రామస్తులు కోరుతున్నారు.

గూడ్సురైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ శంకరయ్య తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి వద్ద వికారాబాద్ నుంచి బీదర్‌కు రైలు ప్రయాణం చేసిన టికెట్ లభించింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9989355134 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పేదల పార్టీ కాంగ్రెస్

- చేవెళ్ల రోడ్‌షోలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి
- విశ్వేశ్వర్‌రెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని డిమాండ్



రోడ్డుషోలో రంజిత్‌రెడ్డిని భారీ గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: పేదల సంక్షేమాన్ని కోరేదే కాంగ్రెస్‌పార్టీ అని ఆ ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి చేవెళ్లలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. యువతకు ఏటా 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు. తనపై ఆరోపణలు చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి ఈ ప్రాంతం అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో తాను అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు. విశ్వేశ్వర్‌రెడ్డి కబడ్దార్ అంటూ హెచ్చరించారు. దేవుడి పేరుచెప్పి ఓట్లు దండుకోవటం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భీంభరత్, సత్యనారాయణరెడ్డి, జానార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుత చిక్కేనా..?

- ఎయిర్‌పోర్టు పరిసరాల్లో సంచారం
- ప్రత్యేక బృందాలతో పట్టుకునేందుకు ఏర్పాట్లు

శంషాబాద్ రూరల్: ఎయిర్‌పోర్టు పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను బంధించేందుకు ఫారెస్టు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఐదు రోజుల కిందట శంషాబాద్ ఎయిర్‌పోర్టు రన్‌వే సమీపంలో చిరుత సంచరించినట్లు గుర్తించారు. దీంతో చిరుత కోసం అక్కడ ప్రత్యేకంగా బోన్‌లు, కెమెరాలు అమర్చారు. ఐదు బోన్లను పెట్టి అందులో మేకలను ఎరగా పెట్టారు. బోను వరకు వచ్చిన చిరుత చిక్కకుండా పోతోంది. ఈ దృశ్యాలు తాజాగా కెమెరాల్లో నిక్షిప్తం అయ్యాయి. దీంతో ఫారెస్టు అధికారులు చిరుతను పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణకు దిగారు. ప్రత్యేక నిఘా పెట్టి పట్టుకునేందుకు గురువారం రాత్రి రంగంలోకి దిగారు. చిరుతకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి బంధించేందుకు ఏర్పాట్లు చేశారు.

స్థానికుల్లో ఆందోళన..

ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. విమానాశ్రయం దక్షిణ వైపు పొలాలు, పొదలతో కూడిన పెద్ద గుట్ట ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో రైతుల సంచారం ఉంటుంది. అయితే చిరుత సంచారంతో వారు భయాందోళనకు గురవుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభకు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ, రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ సభ్యుడు భూపతి గళ్ల మహిపాల్, మంచాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడురాంరెడ్డి, ఆరుట్ల ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంటలో వ్యక్తి మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఎర్రకుంటలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుజూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుబన్‌కాలనీలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు గురువారం చెత్తను శుభ్రం చేస్తుండగా ఎర్రకుంటలో మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరకురని క్లూస్ టీం సాయంతో వివరాలు సేకరించారు. సదరు వ్యక్తి పక్కనే ఉన్న వైన్ షాపులో మద్యం తాగి మూత్ర విసర్జనకు వచ్చి ఎర్రకుంటలో ప్రమాదవశాత్తు పడి ఉంటాడని పోలీసులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐని బెదిరించి చైన్, సెల్‌ఫోన్లు చోరీ



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తదితరులు

నలుగురు నిందితుల అరెస్ట్

కాచిగూడ: వ్యసనాలకు, మద్యానికి బానిసై బెదిరింపులు, దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు యువకులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, కాచిగూడ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గోరఖ్‌నాథ్ మాల్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ గురువారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి, ప్రగతినగర్ కాలనీకి చెందిన డి.ప్రసాద్ దార్బిలింగ్‌లో సీఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 26న రాత్రి ఎంఎంటీఎస్ రైల్లో ఇంటికి వెళ్తుండగా నలుగురు గుర్తుతెలియని యువకులు అతడిపై కత్తులతో దాడిచేసి అతడి వద్ద ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.700 నగదు, 2 సెల్‌ఫోన్లు లాక్కుని ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో దిగి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు యువకులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం అలియాస్ ఇబ్రహీం పఠాన్, యాకత్‌పురకు చెందిన మహ్మద్ తౌహీద్, మాదన్నపేటకు చెందిన మహ్మద్ అనాసుద్దీన్, పిసల్‌బండకు చెందిన మహ్మద్ ముఖీత్ పాత నేరస్తులు. వీరు జులాయిగా తిరుగుతూ ముఠాగా ఏర్పడి రైల్వేస్టేషన్లలో, రైళ్లలో ప్రయాణికుల బ్యాగులోంచి నగదు, సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగలిస్తుంటారు. వీరిపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వారి నుంచి బంగారు చైన్, రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లు, రిస్ట్‌వాచ్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

కంట్రీమేడ్ పిస్టల్ స్వాధీనం

అక్రమంగా ఆయుధం కలిగి ఉన్న యువకుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న పిస్టల్, బుల్లెట్లు

జీడిమెట్ల: అక్రమంగా ఆయుధం కలిగి ఉన్న ఓ యువకుడిని బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌కు చెందిన గుడ్డి వంశీకృష్ణాగౌడ్‌కు మధ్యప్రదేశ్‌కు చెందిన విశాల్ యాదవ్ అనే వ్యక్తితో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల్లోనే వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ నేపథ్యంలో విశాల్‌యాదవ్ తాను పిస్టల్స్ విక్రయిస్తానని, ఒక్కో తుపాకీ విలువ రూ.50వేలు ఉంటుందని చెప్పాడు. ఆయుధాల వ్యాపారం చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని చెప్పడంతో వంశీ కృష్ణా అతడికి ఫోన్‌పే ద్వారా రూ.19వేలు చెల్లించాడు. మార్చి 6న విశాల్ ఖాజీపేటకు వచ్చి వంశీకృష్ణాగౌడ్‌కు ఫోన్ చేయడంతో అతను అక్కడికి వెళ్లి రూ.30వేలు చెల్లించి కంట్రీమేడ్ పిస్టల్ మూడు రౌండ్స్ బుల్లెట్స్ తెచ్చుకున్నాడు.

రూ. 2 లక్షలకు బేరం

అప్పటి నుంచి వంశీకృష్ణ తన వద్ద ఉన్న పిస్టల్‌ను రూ.2లక్షలకు విక్రయించేందుకు బేరం పెట్టాడు. బుధవారం రాత్రి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు చింతల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో యాక్టీవాపై వెళుతున్న అతడిపై అనుమానంతో పోలీసులు బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఒక కంట్రీమేడ్ పిస్టల్‌తో పాటు మూడు రౌండ్ల బుల్లెట్లు లభ్యమయ్యాయి. వంశీకృష్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.73 కోట్ల విలువైన నల్లమందు పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రూ.1.73 కోట్ల విలువైన నల్లమందు తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ తెలిపారు. శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ బాబుల్‌రెడ్డి నగర్‌లో నిర్వహించిన సోదాల్లో బొలేరో వాహనంలో తరలిస్తున్న సుమారు 2.30 కిలోల నల్లమందు, 35 కిలోల ఓపీఎం పిప్పిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దల్‌రామ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బొలెరో, ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు.

మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్‌గా నగరవాసి

- వైద్య వృత్తితో పాటు అందాల పోటీల్లో రాణింపు
- మిసెస్ ఇండియా తెలంగాణ 2023 విజేతగానూ డాక్టర్ స్రవంతి



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన డాక్టర్ స్రవంతి గాధిరాజు ప్రతిష్ఠాత్మక మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్‌గా ఎంపికై ప్రత్యేకతను చాటుకుంది. మిసెస్ ఇండియా తెలంగాణ 2023 విజేతగా నిలిచిన డాక్టర్ స్రవంతి జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల న్యూఢిల్లీలోని గురుగ్రామ్ వేదికగా అందాల కిరీటం అందుకున్నారు. ప్రముఖ గైనిక్ అంకాలజిస్టు, సామాజిక సేవకులరాలైన డాక్టర్ స్రవంతి ఈ సందర్భంగా మాట్లాడుతూ., ప్రపంచ వేదికపై దేశానికి ప్రాతినిథ్యం వహించడం సంతోషంగా ఉందని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ప్రచారం చేసే అవకాశం దక్కిందన్నారు. భారతదేశాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి, ప్రేమ, శాంతికి నిర్వచనమని చెబుతూ..తన వంతు ప్రతిభాపాటవాలను ప్రదర్శించడానికి కృషి చేస్తానని అన్నారు. డాక్టర్ స్రవంతి గైనక్ ఆంకాలజీలో అంతర్జాతీయ ఫెలోషిప్‌తో పాటు గతంలో వైద్య సేవారత్న అవార్డు, డా. ఏపీజే అబ్దుల్ కలాం మెడికల్ ఎక్సలెన్స్ అవార్డ్, డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డు, హ్యుమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డులను అందుకున్నారు.